సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 21 । నవంబర్ । 2023



బీఆర్ఎస్‌తో ఒరిగిందేమీ లేదు
తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి అన్నారు. - 4లో



బాలలపై దాడులను అరికట్టాలి
సమాజంలో బాలలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి కోరారు. - 4లో



యాదాద్రిలో ఆధ్యాత్మిక శోభ
యాదాద్రి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. - 4లో

న్యూస్‌రీల్

డిసెంబర్ 9న మెగా లోక్‌అదాలత్

చివ్వెంల (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో డిసెంబర్ 9న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా మొదటి ఆదనపు న్యాయమూర్తి ఎస్.అమరావతి తెలిపారు. జిల్లా మొదటి న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు సోమవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రాజీపడే కేసులను పరిష్కరించుకునే విధంగా చూడాలని కోరారు. అనంతరం ఆమెను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, ఆదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గొండ్రాల అశోక్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

భద్రత కట్టుదిట్టం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.వెంకట్రావు తెలిపారు. సోమవారం జిల్లాకు వచ్చిన ప్రత్యేక వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్, వ్యయ పరిశీలకులు ప్రమోద్‌కుమార్, విజయ్ నెటికె, ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ ప్రియాంకతో కలిసి స్థానిక కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన ఖర్చులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లలో రోజు వారీగా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా అందిన 1478 ఫిర్యాదులను పరిష్కరించామని, అలాగే సి-విజిల్ ద్వారా 312రాగా 232 ఆర్ఓ లెవల్‌లో పూర్తి చేశామని, అదే విధంగా 80ఫిర్యాదులు జిల్లా స్థాయిలో పరిష్కరించామన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ సతీష్‌కుమార్, ఎక్సైజ్ పర్యవేక్షకులు అనిత, డీఎస్ఓ శ్రీధర్, నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

మొదటి విడత తనిఖీ పూర్తి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : జిల్లాకు అదనంగా తీసుకున్న 570 ఈవీఎంల మొదటి విడత తనిఖీ (ఫస్ట్ లెవల్ చెకింగ్) పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంకట్రావు తెలిపారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని పాత కలెక్టరేట్ గోదాంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన ఎఫ్ఎల్‌సీని అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఎ.వెంకట్‌రెడ్డిలతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాల్లో ఎక్కువ మంది అభ్యర్థులు పోటీలో ఉన్నందున అదనపు ఈవీఎంలు అవసరం వచ్చాయని, వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేపట్టామని, ర్యాండమైజేషన్ అనంతరం నియోజకవర్గాలకు పంపించనున్నట్లు వెల్లడించారు.

సౌత్ జోన్ పోటీలకు ఎన్జీ విద్యార్థుల ఎంపిక

రామగిరి(నల్లగొండ): ఎంజీయూ క్యాంపస్‌లో సోమవారం జరిగి అంతర్ కళాశాలల యోగా, పుట్‌బాల్ పోటీల్లో ఎన్జీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కదారి మల్లేష్ మాట్లాడుతూ కళాశాలకు చెందిన సీహెచ్.ప్రణయ్‌కుమార్, వి.ప్రశాంత్, బి.వినయ్, కె.నవీన్‌కుమార్ యోగా విభాగంలో, ఎం.లావణ్య ఫుట్‌బాల్ విభాగంలో సౌత్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

కొండమల్లేపల్లికి చేరిన నిరుద్యోగ చైతన్య యాత్ర

కొండమల్లేపల్లి: హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఈనెల 15న చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్ర సోమవారం కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు ఓయూ విద్యార్థులు మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొనసాగిన తెలంగాణ మలి దశ ఉద్యమంలో ఓయూ విద్యార్థులు ప్రధాన పాత్ర పోషించారని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఒక్క నిరుద్యోగికి కూడా ఉద్యోగం ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు.



నల్లగొండలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రజలు



నకిరేకల్‌లో సీఎం కేసీఆర్ సభకు హాజరైన జనం



నల్లగొండ సభలో అభివాదం చేస్తున్న కేసీఆర్



నకిరేకల్‌లో పాట పాడుతున్న మధుప్రియ

ఊహించని విధంగా అభివృద్ధి చేస్తాం

నల్లగొండ ఇంకా నా దత్తతలోనే ఉంది

- నా డ్యూటీ పూర్తి కాలే .. భూపాల్‌రెడ్డి డ్యూటీ అయిపోలే...
- ప్రజల్లో ఉండే ఎమ్మెల్యే కావాల్నో.. హైదరాబాద్‌లో ఉండే ఎమ్మెల్యే కావాల్నో ఆలోచించండి
- ధర్మారెడ్డి కాలువ, పిలాయిపల్లి కాలువ పనులన్నీ పూర్తి చేస్తాం
- కమ్యూనిస్టు సోదరులు బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి
- నల్లగొండ, నకిరేకల్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

నల్లగొండపై మరోసారి గులాబీ జెండా ఎగరాలి : కంచర్ల



'నల్లగొండ 20 ఏళ్ల గోస తీర్చినం. కేసీఆర్ చల్లని చూపుతోనే నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నాం' అని నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ దత్తత తీసుకొని నల్లగొండకు రూ.1,700 కోట్లు ఇచ్చారని చెప్పారు. మరోసారి నల్లగొండపై గులాబీ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. సేవకుడిగా, రక్షకుడిగా తనకు అవకాశం ఇవ్వాలని, కేసీఆర్‌ను మూడవ సారి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు.

నల్లగొండ, నకిరేకల్: 'నల్లగొండ ఇంకా నా దత్తతలోనే ఉంది. నా డ్యూటీ ఇంకా పూర్తి కాలే.. భూపాల్‌రెడ్డి డ్యూటీ పూర్తి కాలేదు.. నల్లగొండలో మీరు ఊహించని విధంగా ఇద్దరం కలిసి అభివృద్ధి చేసి చూపిస్తాం' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణ పరిధిలోని మర్రిగూడ బైపాస్ వద్ద, నకిరేకల్‌లో నిర్వహించిన ప్రజాశీర్వాద సభల్లో కేసీఆర్ ప్రసంగించారు. కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

నల్లగొండ పట్టణ అభివృద్ధికి రూ.1,400 కోట్లు మంజూరు చేశాను. పట్టణంలో రోడ్లతో పాటు ఐటీ హబ్ ఇతర అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఐటీ హబ్ వల్ల 1500 మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇక్కడ రెండు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి అభివృద్ధిని పట్టించుకోలేదు. ప్రస్తుతం పట్టణం శరవేగంగా నగర రూపాన్ని సంతరించుకుంటోంది. అభివృద్ధి విషయంలో గతానికి ప్రస్తుతానికి బేరీజు వేసుకొని ఆలోచించి ఓటేయాల్సిన అవసరం ఉంది. ఉదయ సముద్రం గతంలో ఎలా ఉండే తెలంగాణ వచ్చిన తర్వాత ఎలా అభివృద్ధి చెందుతుందో గమనించాలి. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు గతంలో మెడికల్ కాలేజీ లేకుండే, నల్లగొండతో పాటు ఇతర జిల్లాలకు మెడికల్ కాలేజీలు నిర్మించుకున్నాం. ప్రజల మధ్య ఉండే ఎమ్మెల్యే కావాల్నా.. గెలిచిన తెల్లారే హైదరాబాద్‌లో పండే ఎమ్మెల్యే కావాల్నో ఆలోచించాల్సిన అవసరం ఉంది. భూపాల్‌రెడ్డి గెలిచినా, ఓడినా అదే ఇంట్లో ఉన్నాడు. మైనార్టీ సోదరులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోతే అభివృద్ధి ఆగిపోతుంది. నల్లగొండ ఎమ్మెల్యేగా భూపాల్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించండి. ఇక్కడ భూపాల్‌రెడ్డి గెలిస్తే రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది.

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పూర్తి చేస్తాం

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ట్రయల్ రన్ ఇప్పటికే పూర్త అయింది. రేపు అధికారంలోకి వచ్చిన ఐదారు నెలల్లోనే ఈ ప్రాజెక్టు పనులన్నింటినీ పూర్తి చేస్తాం. తద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. నకిరేకల్ నియోజకవర్గంలో ధర్మారెడ్డి కాల్వ, పిలాయిపల్లి కాల్వల పనులు 70శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూడా పూర్తయి నీళ్లు వస్తాయి. రామన్నపేట కరువు ప్రాంతమని నాకు తెలుసు. కాళేశ్వరం లింక్ చేస్తే భువనగిరి దగ్గర ఉన్న బస్వాపూర్ రిజర్వాయర్ నుంచి ఈ మండలానికి బ్రహ్మాండంగా నీళ్లు వస్తాయి. దీనికోసం ప్రతిపాదనలు కూడా పెట్టాం. చిరుమర్తి లింగయ్య కోరిన అయిటి పాముల ఎత్తిపోతల పథకం గానీ, మరొకటి కానీ అన్నీ పూర్తి చేస్తాం. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇక్కడి ఎమ్మెల్యే నర్రా రాఘవరెడ్డి కరెంటు కోసం రోజూ కొట్లాడుతుండే.. ఎండిపోయిన వరి కంకులు తెచ్చి అసెంబ్లీలో చూపిస్తుండే.. అటువంటి మహానాయకుడు పుట్టింది ఇక్కడే.. కమ్యూనిస్టు సోదరులకు చెబుతున్నా మీ ఓట్లు ఎవ్వరికో వేసి మోరీలో పడవేయవద్దు. ప్రగతి కాముకుడు అయిన చిరుమర్తి లింగయ్యకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వాలి. మంచి వ్యక్తి లింగయ్యను బ్రహ్మాండమైన మెజార్టీతో గెలిపించండి అని సీఎం కోరారు. ఈ సభల్లో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, గొర్రెల, మేకల పెంపకందారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూది మెట్ల బాలరాజుయాదవ్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, చాడ కిషన్ రెడ్డి, చింతల సోమన్న, నలగాటి ప్రసన్నరాజ్, చేపూరి రవీందర్, చెరుకు లక్ష్మి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, బలరాం, ఆయా మండలాల అధ్యక్షులు ప్రగడపు నవీన్ రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పల్‌రెడ్డి మహేందర్ రెడ్డి, సోమ యాదగిరి, రాచకొండ శ్రవణ్, కొండ శ్రీను, సామ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి భూపాల్‌రెడ్డి



నకిరేకల్ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన అభ్యర్థి లింగయ్య

అభివృద్ధి చేసి నకిరేకల్‌లో మార్పు తెచ్చాను
- చిరుమర్తి లింగయ్య

ధర్మానికి, అధర్మానికి జరుగుతున్న ఈ ఎన్నికల్లో ధర్మాన్ని గెలిపించాలని నకిరేకల్ బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య కోరారు. దళితుడినైన తనపై కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. నాడు తాను కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచినా నియోజకవర్గ అభివృద్ధి, ప్రశాంత పాలన కోసమే గులాబీ పార్టీలో చేరానని ఈ విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు. కేసీఆర్ ఆశీస్సులతో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసి నియోజకవర్గంలో మార్పు తీసుకొచ్చినట్లు చెప్పారు. చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తనపై విమర్శలు చేస్తున్నారని, తనను చంపుతామని కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని అన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కేసీఆర్, ప్రజల ఆశీస్సులతో ముందుకు సాగుతానని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి మరో సారి గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా అందించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు చిట్యాలలో అండర్ పాస్, అయిటిపాముల లిఫ్ట్ తదితర పనులు చేపట్టాలని సీఎంను కోరారు.

నేడు సూర్యాపేటకు కేసీఆర్

- ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లు పూర్తిచేసిన మంత్రి జగదీష్‌రెడ్డి
- భారీగా జనసమీకరణకు కసరత్తు

సూర్యాపేట : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మంగళవారం సూర్యాపేటకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని నూతన వ్యవసాయ మార్కెట్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సూర్యాపేట నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్నారు. ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లన్నీ రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పూర్తి చేశారు. సీఎంతో పాటు మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూర్చోవడానికి వీలుగా వేదికను సిద్ధం చేశారు. సభకు భారీగా జనాన్ని తరలించి విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కసరత్తు చేస్తున్నాయి. హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం హెలిపాడ్ సిద్ధం చేశారు.



సూర్యాపేటలో సిద్ధమైన సభా వేదిక

కాంగ్రెస్ పార్టీ చేసింది ఏమీలేదు

- మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : ప్రజల కోసం పనిచేసిన చరిత్ర కాంగ్రెస్‌కు ఏనాడూ లేదని, గ్రామాల్లో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి శూన్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి, సూర్యాపేట బీఆర్ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలంలోని కేసారం, కాసరబాద, తాళ్ల ఖమ్మం పహాడ్, రూప్లతండా, జాటోత్‌తండా, రామ్లతండా, ఇమాంపేట గ్రామాల్లో విస్తృతంగా అసెంబ్లీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎన్నోసార్లు ఓటు వేసిన ప్రజలు ఎవరికి వేసిన ఓటుతో ఏమొచ్చిందో ఆలోచన చేయాలని కోరారు. 'మనం వేసే ఓటే మన తలరాతను మారుస్తుంది' అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో గ్రామాల్లో ఒక్కరికో ఇద్దరికో పెన్షన్లు వస్తే, పెన్షన్ రానివారు తీసుకుంటున్న వారి చావుకోసం ఎదురు చూసే పరిస్థితులు ఉండేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్వయం పాలనలో తండాలు అభివృద్ధి చెందాయన్నారు. ఆరు దశాబ్దాల కాలంలో కాంగ్రెస్ చేయని అభివృద్ధిని, పదేళ్లలోనే చేసి చూపించానన్నారు. కళ్ల ముందు కనబడుతున్న అభివృద్ధిని చూసి మరోసారి తనను ఆశీర్వదించాలని ఆయన కోరారు. డ్రైపోర్టు తీసుకువచ్చి గ్రామాల్లో ఉన్న నిరుపేదలకు దానిలో ఉపాధి కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాసరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



ఇమాంపేటలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

'కారు'కు ఓటేస్తే మరిన్ని పథకాలు

- రాష్ట్రంలో అత్యధిక ధాన్యం పండిస్తున్న జిల్లా నల్లగొండ
- అసైన్డ్ భూములు అమ్ముకునేలా చట్టం తెస్తాం
- యాదాద్రి కొండపైకి ఆటోలు అనుమతిస్తాం
- బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడ రోడ్ షోలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



యాదగిరిగుట్టలో కేటీఆర్ రోడ్ షోకు హాజరైన జనం



యాదగిరిగుట్ట రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, పక్కన అభ్యర్థి సునీత



మిర్యాలగూడ రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో అభ్యర్థి భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడ : గాడిదలకు గడ్డేసి ఆవులకు పాలు పిండితే పాలు వస్తాయా? అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి పథకాలు అడిగితే రావని, కారు గుర్తుకు ఓటేస్తే మరిన్ని పథకాలు వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడలో నిర్వహించిన రోడ్‌షోలలో మాట్లాడారు. స్వరాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేశారని చెప్పారు. రాష్ట్రంలో అత్యధికంగా వరి పండిస్తున్న జిల్లా నల్లగొండ అని.. రైతులకు రైతుబంధు అందించడం ద్వారానే ఈ ఘనత సాధ్యమైందని అన్నారు. అసైన్డ్ భూములు ఉన్నవారికి శుభవార్త అని నూతన చట్టం తీసుకురావడం ద్వారా అసైన్డ్ భూములు అమ్ముకునే విధంగా, బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకునే అవకాశం ఉంటుందని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో దేశంలోనే అతి పెద్దదైన యాదాద్రి పవర్‌ప్లాంట్ రూ.30 వేల కోట్లతో నిర్మిస్తున్నామని, ఈ ప్లాంట్‌లో స్థానిక యువతకే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు ఉంటే మొట్టమొదట మిర్యాలగూడ జిల్లా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మిర్యాలగూడలో ఈ ర్యాలీ చూస్తే కాంగ్రెసోళ్లు గెలుపు మీద ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తపనపడే నల్లమోతు భాస్కర్‌రావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.

డిసెంబర్ 3 నుంచి యాదాద్రి కొండపైకి ఆటోలు..

యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని నమ్ముకుని ఉపాధి పొందుతున్న 300మంది ఆటో కార్మికులను తప్పని సరిగా ఆదుకుంటామని, డిసెంబర్ 3వ తేదీ తరువాత వారి ఆటోలను కొండపైకి అనుమతిస్తామన్నారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం అద్భుతంగా పునఃనిర్మాణం జరిగిందని, ఇప్పుడు తిరుపతి ఆలయంతో పోటీ పడుతోందన్నారు. ఆలయ అభివృద్ధిలో నష్టం జరిగిన వారిని ఆదుకుంటున్నామన్నారు. ప్రతి ఊరిలో మహిళా సమాఖ్య భవనాలను రాణిరుద్రమ, సమ్మక్క సారక్క పేర్లతో నిర్మిస్తామన్నారు. దండుమల్కాపూర్‌లో మాదిరిగా తుర్కపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ పనులు మొదలు పెట్టామని, వచ్చే ప్రభుత్వంలో దతారుపల్లిలో టూరిజం పార్క్, ఆలేరును రెవెన్యూ డివిజన్, రఘునాథపురం, మాదాపురం గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తామన్నారు. గొంగిడి సునీత ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ సాధిస్తే.. అక్క అడిగిన పనులన్నీ చేస్తానన్నారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌కు రాష్ట్ర స్థాయిలో, చట్టసభల్లో అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు.

కేసీఆర్ విధానాల వల్లే రైతుల కళ్లలో ఆనందం..

కేసీఆర్ చేపడుతున్న విధానాల వల్ల రైతులు ఆనందంగా జీవిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సీఎం చలువతో యాదాద్రి దేవస్థానం అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత భువనగిరిప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈఎన్నికల్లో భువనగిరి ఎమ్మెల్యేగా పైళ్ల శేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగం



సంస్థాన్ నారాయణపురంలో ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు

సంస్థాన్ నారాయణపురం: వృద్ధులు, దివ్యాంగులు తమ ఓటు హక్కును ఇంటి వద్ద నుంచే వినియోగించుకున్నారు. ఫారం డీ–12 ద్వారా ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని వివిధ గ్రామాలలో ఎన్నికల సిబ్బంది, బీఎల్‌ఓలు కలిసి బ్యాలెట్ ఓట్లు వేయించారు.

ప్రచారం.. వినూత్నం



ఆలేరు పట్టణంలో భిక్షాటన చేస్తూ ప్రచారం చేస్తున్న కందాడి మణిపాల్‌రెడ్డి

ఆలేరురూరల్, మోటకొండూర్: ఆలేరు నియోజకవర్గం నుంచి తెలంగాణ రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కందాడి మణిపాల్‌రెడ్డి సోమవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని పలు షాపుల్లో భిక్షాటన చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. మైకు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మోటకొండూర్‌లో చేతికి ఇనుప సంకెళ్లు వేసుకొని ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం కేసీఆర్ చేతిలో బందీ అయ్యిందని ఆరోపించారు.



మోటకొండూర్‌లో చేతికి సంకెళ్లు వేసుకొని ప్రచారం చేస్తున్న కందాడి మణిపాల్‌రెడ్డి



వలిగొండలో మంత్రి కేటీఆర్ రోడ్ షోకు భారీగా హాజరైన ప్రజలు



వలిగొండ రోడ్ షోలో అభివాదం చేస్తున్న కేటీఆర్, పక్కన భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి, నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

రోడ్ షోలతో జోష్

- గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిన కేటీఆర్
- యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడలో భారీ ర్యాలీలు

బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ యాదగిరిగుట్ట, వలిగొండ, మిర్యాలగూడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నిర్వహించిన రోడ్ షోలు గులాబీ శ్రేణుల్లో జోష్ నింపాయి. రోడ్ షోలకు ఆయా చోట్ల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు, రైతులు తరలివచ్చారు. బోనాలు, కళాకారుల ఆటపాటలు, డోలు, డప్పు, కోలాట కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యకర్తల ర్యాలీలతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి.



యాదగిరిగుట్ట రోడ్ షోలో మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని ఇళ్ల పైకి ఎక్కి వింటున్న ప్రజలు



మిర్యాలగూడ రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి భాస్కర్‌రావు తదితరులు

యాదగిరిగుట్ట: మంత్రి కేటీఆర్ రోడ్ షో సందర్భంగా ఉదయం 11గంటలకే యాదగిరిగుట్ట పట్టణమంతా గులాబీ జెండాలతో నిండిపోయింది. వైకుంఠద్వారం నుంచి బస్టాండ్ వరకు నాయకులు, కార్యకర్తల హడావుడి నెలకొంది. మధ్యాహ్నం 1.35 గంటలకు పెద్దగుట్ట హెలిపాడ్ నుంచి పాతగుట్ట చౌరస్తాకు వచ్చిన మంత్రి కేటీఆర్ మాట్లాడుతుండగా.. సీఎం.. సీఎం అంటూ యువకులు నినాదాలు చేశారు. దీంతో కేటీఆర్ కలుగజేసుకొని సీఎం హైదరాబాద్‌లో ఉన్నారని సమాధానం ఇచ్చారు. అనంతరం అభ్యర్థి గొంగిడి సునితా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలేరు అసెంబ్లీ స్థానంలో మూడవ సారి బంపర్ మెజార్టీతో తెలుస్తున్నామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ యాదాద్రి ఆలయాన్ని పునర్నిర్మాణం చేయడం ద్వారా దేశమంతా ఇటువైపు చూసేలా చేశారన్నారు. రోడ్‌షోలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బూడిద భిక్షమయ్యగౌడ్, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, రాష్ట్ర నాయకులు కల్లూరి రామచంద్రారెడ్డి, సూధగాని హరిశంకర్‌గౌడ్, మదర్‌డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, అల్డా చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి, టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గులాబీమయమైన సాగర్ రోడ్డు..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాగర్ రోడ్డులోని అద్దంకి–నార్కట్‌పల్లి బైపాస్ ఫ్లైఓవర్ నుంచి రాజీవ్ చౌక్ వరకు రోడ్‌షో నిర్వహించారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద కేటీఆర్‌కు భారీ పూలమాలలతో స్వాగతం పలికారు. రోడ్‌షోకు వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో సుమారు కిలోమీటర్ మేర రోడ్డంతా గులాబీమయంగా మారింది. కార్యక్రమంలో మిర్యాలగూడ అభ్యర్థి నల్లమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, బీఆర్ఎస్ నాయకులు అలుగుబెల్లి అమరేందర్‌రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, జొన్నలగడ్డ రంగారెడ్డి, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, జెడ్పీటీసీలు లలిత హాతీరాం, ఇరుగు మంగమ్మవెంకటయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, మట్టపల్లి సైదులుయాదవ్, కూరాకుల చినరామయ్య, వంగాల నిరంజన్‌రెడ్డి, ధనావత్ చిట్టిబాబునాయక్, నల్లమోతు చైతన్య, సిద్దార్థ, నిమ్మల నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వలిగొండలో పూలవాన..

వలిగొండ: వలిగొండలో తొర్రూర్ చౌరస్తా నుంచి రాజీవ్‌గాంధీ విగ్రహం వరకు రోడ్‌షోలో పూల వర్షం నడుమ సాగింది. ప్రజలు పెద్దఎత్తున తరలి రావడంతో వలిగొండలోని ప్రధాన రోడ్డు కిక్కిరిసిపోయింది. ఈ రోడ్‌షోలో భువనగిరి అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పది సంవత్సరాలుగా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానని చెప్పారు. మూడోసారి గెలిపిస్తే వలిగొండ మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానన్నారు. రోడ్ షోలో కేటీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో యువకులు సమీపంలోని ఓ ఇంటి పైకి చేరి ప్రభుత్వం ఇచ్చిన హామీలైన కేజీ టు పీజీ విద్య ఎక్కడ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ, ఇంటికో ఉద్యోగం ఎక్కడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎక్కడ, నిరుద్యోగ భృతి ఎక్కడ అంటూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. వారిని పోలీసులు చెదరగొట్టారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, కొలుపుల అమరేందర్, పైళ్ల రాజవర్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ



మిర్యాలగూడ రోడ్ షోలో మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు



వలిగొండ రోడ్ షోలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

ఎన్నికల సిత్రాలు

- గెలుపు గుర్తుండిపోయేలా..



తిరుమలగిరి మండలం జలాల్‌పురంలో సెల్ఫీ దిగుతున్న తుంగతుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్

- ప్రచారంలోనూ భాగస్వామినవుతా..



నల్లగొండ పట్టణంలోని శాంతినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సతీమణి సబిత

- ఒక్కో ఓటు పేర్చుకుంటా..



ప్రచారంలో భాగంగా మఠంపల్లి మండలం హనుమంతులగూడెంలో తాపీ పనిచేస్తున్న హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు సోమవారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకార్చనలు, మూలవిరాట్‌మూర్తికి, పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలు అలంకరించి కల్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. క్షేత్రంలో గల శ్రీపార్వతీ రామలింగేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపిక

భువనగిరి : కర్నాటకలో ఈ నెల22నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ సమైక్యత శిబిరానికి భువనగిరిలోని జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థిని ఎంపికయ్యారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సూర్యానారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మణిపాల్‌రెడ్డి విద్యార్థిని లక్ష్మిక ఎంపిక పత్రం అందజేసి సత్కరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో నైపుణ్యం పెంచేందుకు క్రీడలు, యువజన సర్వీసుల ఆధ్వర్యంలో కేంద్రం ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాల్లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పదేళ్లుగా జాతీయ సమైక్యత శిబిరాలకు ఎంపిపవుతున్నారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.



విద్యార్థికి ఎంపిక పత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్

ఆలయంలో విగ్రహాల చోరీ

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మామిడాల గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో విగ్రహాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం సాయంత్రం ఆలయ అర్చకుడు కారంపూడి స్తంభాచార్యులు గుడి మూసివేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం గుడి తెరిచి చూసేసరికి చెన్నకేశవ స్వామి, శ్రీదేవి అమ్మవార్ల పంచలోహ విగ్రహాలు, రాధాకృష్ణుల చక్ర పెరుమాళ్ల ప్రతిమలు, శ్రీదేవి భూదేవి పుస్తెలు, వెండి కిరీటం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడకు చేరుకున్న పోలీసులు క్లూస్‌టీం సహాయంతో ఆలయం అంతా క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించారు. ఆలయ అర్చకుడి భార్య కారంపూడి మంగతాయారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగయ్య తెలిపారు.

‘రీజినల్’ బాధితులకు అండగా ఉంటాం

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు బాధితులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ హామీ ఇచ్చారు. సోమవారం సాయంత్రం భువనగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పులో ఎమ్మెల్యే ప్రమేయం ఉందని ప్రతిపక్షాల అభ్యర్థులు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఈ ప్రాజెక్టు అలైన్‌మెంట్ మొత్తం కేంద్రం చేస్తుందని తెలిపారు. అలైన్‌మెంట్ మార్పులో తనకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించడమే గాకుండా ప్రస్తుతం ఉన్న అలైన్‌మెంట్‌ను మార్చాలని భువనగిరి మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేసిన విషయాన్ని వారు గుర్తుచేశారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే పట్ల వ్యతిరేకతను పెంచడానికి చేస్తున్న కుట్రలో భాగమే ఈ దుష్ప్రచారం అన్నారు. త్వరలో రీజినల్ రింగ్‌రోడ్డు బాధితులతో సమావేశం నిర్వహించి నిజా నిజాలు వివరిస్తామన్నారు. అలైన్‌మెంట్ మార్పు కోసం ప్రయత్నిస్తామన్నారు. సమావేశంలో రైతు సమన్వయ సమితీ జిల్లా కోఆర్డినేటర్ కొలుపుల అమరేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్లరాజేందర్‌రెడ్డి ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన రీజనల్ రింగ్ రోడ్డు బాధితుడు బాల్‌నర్సింహతో ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌లో చేరిన ట్రిబుల్ ఆర్ బాధితుడు

రీజినల్ రింగ్‌రోడ్డు ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లిన రాయిగిరికి చెందిన మల్లేబోయిన బాల్‌నర్సింహ బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా బాల్ నర్సింహ మాట్లాడుతూ. రీజినల్ అలైన్‌మెంట్‌లో తన భూమి ఏమి పోవడంలేదని తెలిపారు. కార్యక్రమంలో కొలుపుల అమరేందర్, ఎడ్ల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.16.68లక్షలు, మద్యం పట్టివేత

నల్లగొండ: ఎన్నికల తనిఖీల్లో భాగంగా సోమవారం పోలీసులు నల్లగొండ జిల్లా వ్యాప్తంగా రూ.16,68,200 నగదు, రూ.9,096 విలువ చేసే మద్యం సీజ్ చేశారు. 61 మందిపై కేసులు నమోదు చేయడంతో పాటు పది మందిని అరెస్టు చేశారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

- ప్రయాణికులు సురక్షితం

మిర్యాలగూడ టౌన్: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ఘటన సోమవారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప వద్ద చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం... మిర్యాలగూడ ఆర్టీసీ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు సోమవారం మిర్యాలగూడ మండలం ముల్కలకాలువకు వెళ్తూ ఆలగడప వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా నేరేడుచర్ల నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న లారీ బస్సు ముందు భాగంలో ఢీకొట్టింది. బస్సులోని ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రయాణికులు సురక్షితంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ విషయాన్ని బస్సు డ్రైవర్ పాండు మిర్యాలగూడ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్‌కు తెలియజేయగా.. డీఎం ఆదేశాల మేరకు బస్సు డ్రైవర్ మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

ఆలేరురూరల్: ఇంట్లో నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ ఘటన ఆలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆలేరు పట్టణంలోని భరత్‌నగర్‌కు చెందిన యాస్మిన్ నాలుగు నెలల గర్భిణి. ఆదివారం సాయంత్రం చెకప్ కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లిన యాస్మిన్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యాస్మిన్ తండ్రి మహమ్మద్ లాల్‌బీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటశ్రీను తెలిపారు. యాస్మిన్ తన భర్త గుడుమియాతో కలిసి సిద్దిపేటలో నివాసముంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



యాస్మిన్

కోమటిరెడ్డితోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ చీఫ్ విప్ కూడుకున్నిల్ సురేష్

కనగల్: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజా నాయకుడని, అలాంటి నాయకున్ని గెలిపించుకుంటేనే నలగొండ జిల్లా అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ చీఫ్ విప్ కూడుకున్నిల్ సురేష్ అన్నారు. సోమవారం కనగల్ మండల వ్యాప్తంగా కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సోనియాగాంధీ ఆదేశాలతో ఇక్కడికి వచ్చానని, కోమటిరెడ్డి అంటే ఆమెకు ఎంతో గౌరవం అని పేర్కొన్నారు. ఎన్నికల్లో కర్నాటకలో ఇచ్చిన 5 గ్యారంటీ పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల బాగు కోసం సోనియమ్మ 6 గ్యారంటీ పథకాలను ప్రకటించిందని, ప్రభుత్వం ఏర్పడిన వారంలో వాటిని అమలు చేస్తామని చెప్పారు. కోమటిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. సీఐ ఎస్.దేవేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూదాన్‌పోచంపల్లి మండలం బీమనపల్లి గ్రామానికి చెందిన ఎడ్లకాడి భానుప్రకాష్(36) తన అల్లుడు కొమ్ము ప్రసాద్‌తో కలిసి బైక్‌పై ఆదివారం రాత్రి హైదరాబాద్ మార్గంలో వెళ్తున్నారు. ఆ క్రమంలో తూప్రాన్‌పేట గ్రామ శివారులో అశోక ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో అదే మార్గంలో వెళ్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం భానుప్రకాష్ మృతిచెందాడు. మృతుడి భార్య చందన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక


మణికుమార్

నాగారం : నాగారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి దున్నపోతుల మణికుమార్ రాష్ట్రస్థాయి అండర్–17 క్రికెట్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్స వెంకన్న తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాగారం గ్రామానికి చెందిన మణికుమార్ ఈనెల 18న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి అండర్–17 క్రికెట్‌కు బౌలింగ్ విభాగంలో ఎంపికై నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన మణికుమార్‌ను పీఈటీ నవీన్‌కుమార్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఎన్‌ఎస్‌యూఐ కార్యకర్తల నిరసన


నిరసనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

వలిగొండ : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోలో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లుగా యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో విఫలమైందని ప్లకార్డులు ప్రదర్శించారు. రోడ్‌షోలో కేటీఆర్ ప్రసంగానికి అడ్డుతగులుతూ ఆయన వైపు దూసుకెళ్తున్న ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం కేటీఆర్ అక్కడినుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు వెలిమినేటి సురేష్, బర్రె నరేష్, మంగ ప్రవీణ్, బత్తిని నాగేష్, వినయ్, శ్యామల సాయి తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రంలో కార్తీక సందడి


సూర్యక్షేత్రంలో ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అర్వపల్లి: కార్తీకమాసం మొదటి సోమవారం కావడంతో మండల పరిధిలోని తిమ్మాపురంలో ఉన్న అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా క్షేత్రంలో మహిళలు కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

అమాయకులను రెచ్చగొట్టడం సరికాదు

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ విషయంలో కాంగ్రెస్ అభ్యర్థి కుంభం అనిల్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి అమయాక ప్రజలను రెచ్చగొట్టి భువనగిరి ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయించడం సరికాదని రైతు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ కొల్పుల అమరేందర్ అన్నారు. సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రిబుల్ ఆర్ విషయంలో కలెక్టరేట్ వద్ద జరిగిన ఘటనలో అరెస్టు అయిన వారి విషయంలో ఎమ్మెల్యే ప్రమేయం లేదని బాధితులు చెప్పారని తెలిపారు. ప్రతి పక్ష అభ్యర్థులకు నియోజకవర్గంపై ఎలాంటి అవగాహన లేదన్నారు. ఇటీవల భువనగిరికి వచ్చిన కేంద్ర మంత్రి ట్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తామని చెప్పడం సంతోషకరమైన విషయమన్నారు. కేసీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు బాలనర్సింహ, ఏవీ కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


నల్లగొండ ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ చిత్రంలో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మధుసూదనాచారి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, యాదాద్రి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, సైదిరెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, ఉమా మాధవరెడ్డి తదితరులు


నకిరేకల్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ నేతలు చెరుకు సుధాకర్, లక్ష్మి, గుత్తా అమిత్‌రెడ్డి, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు


కేసీఆర్ నుదుట తిలకం దిద్దుతున్న ఎమ్మెల్యే కంచర్ల కూతురు శ్రీలక్ష్మి


నల్లగొండలో సీఎం కేసీఆర్‌కు దట్టీ కడుతున్న ముస్లిం నాయకుడు


నల్లగొండలో బోర్ల రాంరెడ్డిని ఆలింగనం చేసుకుంటున్న కేసీఆర్


నకిరేకల్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చిస్తున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చెరుకు సుధాకర్


నకిరేకల్‌లో కార్యకర్త అభిమానం


నల్లగొండ బహిరంగ సభలో సెల్ఫీ తీసుకుంటున్న యువకుడు

ప్రజా ఆశీర్వాద సభలు సక్సెస్

- కేసీఆర్ బహిరంగ సభలకు భారీగా తరలివచ్చిన జనం

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ జిల్లా కేంద్రంలోని మర్రిగూడ బైపాస్ రోడ్‌లో సోమవారం సాయంత్రం నిర్వహించిన నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభ గులాబీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. బహిరంగ సభ ప్రాంగణం నిండిపోవడంతో పక్కనే ఉన్న అద్దంకి – నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపైనే నిలబడి సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆలకించారు. సభా ప్రాంగణంలో ఉన్న ప్రజలందరూ కేసీఆర్ ప్రసగింస్తున్న సమయంలో జై కేసీఆర్, జై జై కేసీఆర్ అని నినాదాలు చేశారు. కరెంట్ మూడు గంటలు కావాలా ... 24 గంటల కరెంట్ కావాలా అని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు 24గంటలు కావాలని ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకుంటారా అని కేసీఆర్ ప్రశ్నించగా లేదు లేదు అని నినాదాలు చేశారు. భూపాల్‌రెడ్డి గెలిస్తేనే రైతుబంధు ఉంటది ...కరెంట్ 24 గంటలు ఉండాలంటే భూపాల్‌రెడ్డి గెలవాలి .. లేకుంటే పోతది కేసీఆర్ స్పష్టం చేశారు. ముషంపల్లి రాంరెడ్డి 54 బోర్లు వేసిండు. అప్పటి పరిస్థితి అట్ల ఉండే. కాంగ్రెస్ వస్తే మళ్లీ అదే పరిస్థితి వస్తది అని సభికులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ సభలో ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందరావు, ఎంసీ. కోటిరెడ్డి, మాజీమంత్రి ఎలిమినేటి ఉమామాధవరెడ్డి, యాదాద్రి భువనగిరి జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు చకిలం అనిల్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి, బోయపల్లి కృష్ణారెడ్డి, బొర్రా సుధాకర్, మాలె శరణ్యారెడ్డి, కటికం సత్తయ్యగౌడ్, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, గోలి అమరేందర్‌రెడ్డి, జి. వెంకటేశ్వర్లు, నేతి రఘుపతి, సింగం లక్ష్మి, బక్క పిచ్చయ్య, నిరంజన్‌వలి పాల్గొన్నారు.


నల్లగొండలో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎంసీ కోటిరెడ్డి, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, చాడ కిషన్‌రెడ్డి

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

నకిరేకల్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో నిర్వహించిన ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ (ప్రజా ఆశీర్వాద సభ)తో బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. మధ్యాహ్నం 2గంటలకే బహిరంగ సభ ప్రారంభమైంది. నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూర్, నార్కట్‌పల్లి, చిట్యాల, రామన్నపేట మండలాల నుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు భారీగ తరలిరావడంతో సభా ప్రాంగణం జనసంద్రమైంది. భారీ ప్రదర్శనగా డప్పుచప్పులు, మహిళల కోలాటాలు, నృత్యాలతో సభా వేదికకు వచ్చారు. నకిరేకల్‌లోని మూసీ రోడ్డు మొత్తం మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం వరకు జనంతో కిక్కిరిసిపోయింది. ముఖ్యమంత్రి కేసీఆర్ హెలికాప్టర్ మధ్యాహ్నం 3.48 గంటలకు హెలిపాడ్‌కు చేరుకొని కొద్దిసేపు సభా ప్రాంగణం చుట్టూ చక్కర్లు కొట్టి 3.52 గంటలకు ల్యాండింగ్ అయింది. అనంతరం సాయంత్రం 4.02 గంటలకు సీఎం సభావేదిక పైకి చేరుకున్నారు. సాయంత్రం 4.09 గంటలకు సీఎం తన ప్రసంగాన్ని ప్రారంభించి 4.31 గంటలకు ముగించారు. దాదాపు 22 నిమిషాల పాటు కొనసాగిన సీఎం ప్రసంగంలో రైతుబంధు, 24 గంటల కరెంటు కావాలంటే ఇక్కడ చిరుమర్తి లింగయ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరడంతో జనం హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. అనంతరం కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించుకుని నల్ల గొండకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా సభావేదికపై కళాకారులు మధుప్రియ, మానుకోట ప్రసాద్ తమ ఆటాపాటలతో ఉత్తేజ పరిచారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన జరిగిన ఈ ఆశీర్వాద సభలో బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, గోట్ అండ్ షీప్స్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ చెరుకు సుధాకర్, చింతలసోమన్న, నలగాటి ప్రసన్నరాజ్, చేపూరి రవీందర్, చెరుకు లక్ష్మి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీలు మాద ధనలక్ష్మి, బలరాం, ఆయా మండలాల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, సోమ యాదగిరి, రాచకొండ శ్రవణ్, కొండ శ్రీను, సామ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభల సైడ్‌లైన్స్

- సీఎం రాక సందర్భంగా నకిరేకల్‌లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు స్థానిక ఇందిరాగాంధీ విగ్రహం నుంచి చీమలగడ్డ బైపాస్ మీదుగా, సూర్యాపేట నుంచి వచ్చే వాహనాలను బైపాస్ మీదుగా మళ్లించారు.
- సీఎం కేసీఆర్ సభతో నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో గల 15 ఎకరాల మైదానమంతా జనంతో నిండిపోయింది.
- 3.52 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ నకిరేకల్‌లో సభా ప్రాంగణం పక్కనే ల్యాండ్ అయింది.
- 3.58 నిమిషాలకు సీఎం కేసీర్ సభా వేదిక వద్ద విశ్రాంతి కోసం ఏర్పాటు చేసిన వసతిలోకి వెళ్లి 4.02 నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు.
- 4.09 నిమిషాలకు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించారు.
- 4.31 వరకు 22నిమిషాల పాటు కేసీఆర్ ప్రసంగించారు.
- 4.33కు బస్సు ద్వారా హెలిపాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్‌లో నల్లగొండకు వెళ్లిపోయారు.
- సీఎం రాక సందర్భంగా నకిరేకల్‌లో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.
- నకిరేకల్‌లో పట్టణ ప్రధాన రహదారులు మూసీ, తిప్పర్తి రోడ్డు జనంతో నిండిపోయింది.

నల్లగొండలో..

- 4.53 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్ నల్లగొండలోని మర్రిగూడ బైపాస్‌లో ఏర్పాటు చేసి హెలిపాడ్‌లో ల్యాండ్ అయ్యింది.
- 4.55 గంటలకు సీఎం కేసీఆర్ సభావేదిక వద్దకు చేరుకున్నారు.
- 5 గంటలకు స్టేజీ పైకి వచ్చి నాయకులు, ప్రజలకు అభివాదం చేశారు.
- 5.02 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించారు.
- 5.20 గంటలకు సీఎం ప్రసంగం పూర్తయ్యింది.
- 5. 27 గంటలకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- బహిరంగ సభకు వచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున ప్రధాన రహదారి పై నిలబడడంతో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సభా ప్రాంగణంలోకి రావాలని పదే, పదే పిలుపునిచ్చారు.

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాలి

- ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్



జిల్లా ఎన్నికల అధికారులతో సమావేశమైన ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకుడు బాలకృష్ణన్

నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలు ,ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకుడు బీఆర్.బాలకృష్ణన్ ఆదేశించారు. సోమవారం నల్లగొండలోని కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారులు, వ్యయ పరిశీలకలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాన్ని విధిగా నమోదు చేయాలన్నారు. సాధారణ ప్రజలు స్వచ్ఛందంగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ జిల్లాలో సీ–విజిల్ ద్వారా 419 ఎన్నికల ఉల్లంఘన ఫిర్యాదులు రాగా 320 పరిశీలించి 100 నిమిషాల్లో పరిష్కారం చూపామన్నారు. సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు సతీష్ గురుమూర్తి, డీఎం.నిష్మే, సంతోష్ కుమార్, జిల్లా ఎస్పీ అపూర్వరావు పాల్గొన్నారు.

బ్యాలెట్ యూనిట్ల తనిఖీ

అత్యధికంగా 39 మంది అభ్యర్థులు బరిలో ఉన్న మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గానికి అదనంగా కేటాయించిన బ్యాలెట్ యూనిట్లను సోమవారం కలెక్టరేట్‌లోని ఈవీఎంల గోదాములో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్.వి.కర్ణన్, సాధారణ ఎన్నికల పరిశీలకుడు అవినాష్ చంపావత్, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇంజనీర్ల బృందంతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గానికి 770 అదనపు బ్యాలెట్ యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. మొదట విడతలో 383 బ్యాలెట్ యూనిట్లు కేటాయించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్, డీటీ విజయ్ పాల్గొన్నారు.

బాలలపై పెరుగుతున్న దాడులను అరికట్టాలి


క్రీడాకారులతో రిజిస్ట్రార్ రవి, అధ్యాపకులు

నల్లగొండ రూరల్: ప్రస్తుత సమాజంలోని బాలలపై పెరుగుతున్న హింస, దాడులను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి కోరారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఎంజీయూ క్యాంపస్‌లో హక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1989 నవంబర్ 20న ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల విశ్వ తీర్మానాన్ని ఆమోదించిందని గుర్తుచేశారు. తీర్మానంలో పొందుపర్చిన జీవించే, రక్షణ పొందే, అభివృద్ధి చెందే, భాగస్వామ్య హక్కులు బాలలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతిఒక్కరూ బాలల పట్ల బాధ్యతగా మెలుగుతూ బాల్యం ఎప్పుడూ మధురంగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు అరుణ ప్రియ, జ్యోతి, ప్రశాంతి, రవి, రమేష్, ఉపేందర్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నిరకాల క్రీడలకు ప్రాధాన్యం

మహాత్మాగాంధీ యూనివర్సిటీలో అన్నిరకాల క్రీడలకు ప్రాధాన్యమిస్తూనే క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్టు ఆ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవి అన్నారు. సోమవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీ క్యాంపస్‌లో నిర్వహించిన యోగా, టేబుల్ టెన్నిస్, ఫుట్‌బాల్ జట్ల క్రీడాకారుల కోసం ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరై ఆయా పోటీల్లో తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించిన అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలని కోరారు. ప్రతిరోజు క్రీడలు ఆడటంతోపాటు వ్యాయామం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయటపడవచ్చన్నారు. విద్యార్థులు వివిధ అంశాల్లో చురుకుగా ఉండేందుకు క్రీడాపోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడల అధికారులు ఉపేందర్‌రెడ్డి, మురళి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఎస్పీ అభ్యర్థిపై దాడి చేసిన ముగ్గురి రిమాండ్

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో ఆదివారం రాత్రి బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్ పై దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గట్టికల్ వచ్చిన వట్టె జానయ్య, అతని అనుచరుడు చింత రమేష్‌పై గొడ్డళ్లు, కత్తులతో సామ తిరుమలరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. గట్టికల్ గ్రామానికి చెందిన సామ తిరుమలరెడ్డి, ఆయన కుమారులు రాజశేఖర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డిలకు అదే గ్రామానికి చెందిన బండగొర్ల వెంకన్నకు భూమి పంచాయితీ ఉందన్నారు. ఈ విషయంలో వట్టె జానయ్యయాదవ్ బండగొర్ల వెంకన్న తరుపున ఉండి తిరుమల్‌రెడ్డి, కుటుంబ సభ్యులను మందలించినట్లు తెలిపారు. దీంతో జానయ్యయాదవ్‌పై కక్ష పెంచుకున్న తిరుమలరెడ్డి కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ప్రచారానికి గ్రామంలోకి వచ్చిన అతనిపై దాడికి పాల్పడ్డారని తెలిపారు. సామ తిరుమలరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అఖిల్ రెడ్డిపై జానయ్య భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివరించారు.

బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు


చింతపల్లిలో మాట్లాడుతున్న కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే


- తొమ్మిదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు
- కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే

చింతపల్లి: తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభ కరంద్లాజే అన్నారు. బీజేపీ దేవరకొండ ఎమ్మెల్యే అభ్యర్థి కేతావత్ లాలునాయక్‌ను గెలిపించాలని కోరుతూ చింతపల్లి మండలంలోని పలుగ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో కోట్ల రూపాయలు కొల్లకొట్టి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ పాలన వైఫల్యాలు, అవినీతి, నిరంకుశ పోకడలు, కుటుంబ పాలన వంటి అంశాలను పరిశీలిస్తే ఆయన అసమర్థ పాలనపై వెయ్యి ప్రశ్నలు అడిగినా సరిపోవన్నారు. 2014, 2018లో బీఆర్‌ఎస్ అనేక హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. తొమ్మిదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారని, ఎన్ని సార్లు పేపర్ లీకేజీల వల్ల పరీక్షలు రద్దయ్యాయని ప్రశ్నించారు. రైతులకు లక్ష రుణమాఫీ ఎంత వరకు నెరవేరిందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, పాలమూరు–రంగారెడ్డి, ఇతర ప్రాజెక్టుల నిర్మాణం, మిషన్ కాకతీయ, కరెంటు కొనుగోళ్లలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. కేంద్రం తెలంగాణకు రూ.2,91లక్షల ఇళ్లను మంజూరు చేసిందని గుర్తుచేశారు. జనవరి నెలలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కల్యాణ్‌నాయక్, జిల్లా ఇన్‌చార్జ్ ప్రదీప్, చెనమోని రాములు, శివర్ల మేశ్‌యాదవ్, సముద్రాల నగేశ్, బొడ్డు శ్రీనివాస్, దావా శ్రీనివాస్, ధరణిపతి రమణారావు, బొడ్డు మహేశ్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన ఎడమకాల్వ ఎస్కేప్ షట్టర్


చిలుకూరు మండలం పోలేనిగూడెంలో నీటమునిగిన వరిపొలాన్ని చూపుతున్న రైతు


చిలుకూరు మండలం పోలేనిగూడెం వద్ద వృథాగా పోతున్న కృష్ణా జలాలు


పోలేనిగూడెం వద్ద ఎస్కేప్ షట్టర్ కొట్టుకుపోవడంతో దిగువకు నీటి ప్రవాహం

యాదాద్రిలో ఆధ్యాత్మిక శోభ


మండపంలో వ్రతాలు జరిపిస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు విశేషంగా కొనసాగాయి. కొండపైనే అనుబంధ ఆలయమైన శ్రీపర్వతవర్ధిని సమేతా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో రుద్రాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. మహా శివుడికి ఇష్టమైన రోజు కావడంతో అభిషేకాలు విశేషంగా చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకోగా, పూజారులు స్వామివారి ఆశీస్సులను అందజేశారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సంప్రదాయ పూజలను కొనసాగించారు. ఆలయంలో వైభవంగా నిత్య కల్యాణ వేడుక, శ్రీసుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు వంటి పూజలు ఆచార్యులు జరిపించారు. కాగా.. కార్తీక మాసం సందర్భంగా కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు, కొండపై దీపారాధన చేశారు.

కాంగ్రెస్ ప్రభంజనంలో బీఆర్‌ఎస్‌కు ఓటమి తప్పదు

- మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

బొమ్మలరామారం : ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎన్ని మోసపూరిత హామీలు ఇచ్చినా కాంగ్రెస్ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. అవినీతిపరులకే మళ్లీ టికెట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ అధినేతకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. బొమ్మలరామారం మండలంలోని రామలింగంపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కుటుంబ సభ్యులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఈ నెల 24న రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఆలేరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల అయిలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, మధు సూధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీర్ల రాజేశ్వర్, ఎంపీటీసీలు ఏర్వ హేమంత్ రెడ్డి, శ్రీహరి, సర్పంచ్ యంజాల కళ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ధనావత్ సునీత, రామిడి జంగారెడ్డి, గట్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.